సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం | 12 | అక్టోబర్ | 2024



తరతరాల చరిత..
చెడీ తాలింఖానా ఘనత


తరతరాల చరితకు అది ఆనవాలు.. రణ రంగాన్ని, వీరత్వాన్ని ప్రదర్శించే వీర విద్యకు చెడీ తాలింఖానా తార్కాణం. - 6లో



ఆటోను ఢీకొన్న కారు

భీమవరం నుంచి ఆటోలో అన్నవరం దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా మురారి శివారులో లారీని తప్పించేయత్నంలో కారు ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. - 6లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12 వేల క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

వంట నూనె ధరలు తగ్గించలేం..

అమలాపురం కిరాణా వర్తకులు



మంత్రి నాదెండ్ల ఆదేశాలపై చర్చిస్తున్న కిరాణా వర్తక అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వంట నూనె ధరలు తగ్గించి అమ్మాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల ఆచరణతో తమకు నష్టాలు వస్తాయని అమలాపురం కిరాణా వర్తక అసోసియేషన్ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. విజయవాడలో జరిగిన కిరాణా వర్తకుల సమావేశంలో మంత్రి నాదెండ్ల ఆయిల్ ప్యాకెట్ల ధరలు తగ్గించి విక్రయించాలన్న ఆదేశాలపై అమలాపురం కిరాణా వర్తక అసోసియేషన్ భవనంలో శుక్రవారం కిరాణా వర్తకుల సమావేశమయ్యారు. ఆయిల్ ప్యాకెట్లు తాము అమ్మితే ప్యాకెట్‌కు రూ.10 నష్టపోతామని వర్తకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ఆయిల్ ప్యాకెట్లు సరఫరా చేసి వాటిపై ధరలు తగ్గించి విక్రయిస్తామని స్పష్టం చేశారు. అమలాపురం కిరాణా వర్తకల అసోసియేషన్ అధ్యక్షుడు తిక్కిరెడ్డి రామకేశవరావు, అసోసియేషన్ కార్యదర్శి తటవర్తి సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వడానికి శిక్షణ సంస్థల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డీఎస్సీల్లో శిక్షణ ఇచ్చి కనీసం 100 మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్ది ఉండాలన్నారు. మూడేళ్ల సరాసరి టర్నోవర్ కనీసం రూ. 40 లక్షల ఉండాలన్నారు. శిక్షణ సంస్థలు 21 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారులు



ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు హాజరైన శాయ్ క్రీడాకారులు

యానాం: ఈజిప్ట్‌లో జరుగుతున్న యూనియన్ ఇంటర్నేషనల్ ది పేంతలేన్ మోడరన్(యూఐపీఎమ్) బైతిల్, ట్రైతిల్ ప్రపంచ చాంపియన్‌షిప్- 2024 పోటీలకు యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) క్రీడాకారులు వెళ్లారని శుక్రవారం కోచ్ గ్రంధి రవితేజ, సెంటర్ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 14 వరకూ ఈజిప్ట్‌లో పోర్ట్ సేడ్‌లో జరుగుతున్న పోటీలకు అండర్-13 విభాగంలో వి.వెంకటనాగసాయి, అండర్-15 విభాగంలో ఎమ్ఎస్ఎస్ జస్విన్‌నాయుడు, అండర్-17 విభాగంలో వి.మణికంఠ నవీన్, టెంక ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారని, వీరు ఇప్పటికే ఈజిప్టుకు చేరుకున్నారని తెలిపారు. ఈ క్రీడాకారులు యానాం సాయ్ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నారని వివరించారు.





మహిషాసుర మర్దినిగా ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు, అమలాపురం శ్రీదేవి అమ్మవారు

ప్రణతులివే పరాశక్తీ..

నవరూపధారిణీ.. విజయప్రదాయినీ.. జగమంతా నీ క్రీగంటి చూపుతో వర్ధిల్లుతున్నది తల్లీ. కరుణ చూపినా.. కన్నెర్రజేసినా.. పాశం విసిరినా.. పాయసం పెట్టినా మము పాలింపగ చూపిన నీ అవ్యాజ ప్రేమపూరిత నవరస భావములే తల్లీ. అంతిమ లక్ష్యం మా విజయాన్ని కాంక్షించి నీవు చూపిన దయా రూపాలేనమ్మా అన్నీ. ఈ విజయదశమి శుభ దినాన నీకివే మా ప్రణామాలు మాతా...



వెదురుపాక విజయదుర్గా పీఠంలో విజయదుర్గమ్మ



మహిషాసురమర్దినిగా ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి

ఆధ్యాత్మిక సీమ



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఆకట్టుకునేలా సెట్టింగ్

- ఆలయాల వద్ద ఆకట్టుకుంటున్న దసరా సెట్టింగులు
- ద్రాక్షారామ, మురమళ్లలో ప్రత్యేక పూజలు
- కళకళలాడిన మార్కెట్

సాక్షి, అమలాపురం: కోనసీమ.. అందాల సీమ. పచ్చని మొక్కలతో నిండిన ప్రకృతి సోయగం.. ఇదో భూతల స్వర్గం.. ఆధ్యాత్మిక సౌరభాలను విరజిల్లే కేంద్రం.. జిల్లాకు దసరా ఉత్సవాల శోభ వచ్చింది. శనివారం విజయ దశమి సందర్భంగా మరింత ముస్తాబు అయ్యింది. పురాణ ప్రసిద్ధి చెందిన ఆలయాలతో పాటు పట్టణాలు, గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, వాడవాడలా ఏర్పాటు చేసిన ఉత్సవాల మండపాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు జరగనున్నాయి.

జిల్లాలో పురాణ ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాలు దసరా వేడుకలకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఈ ఆలయాల్లో ఉత్సవాలు అంబరాన్నంటాయి. దేశంలో 12వ శక్తి పీఠంగా అలరారుతున్న మాణిక్యాంబ అమ్మవారిని దసరా సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు. ఇక్కడకు రోజుకు సుమారు ఐదు వేల మంది వరకూ భక్తులు వస్తుండగా, విజయ దశమి రోజున సుమారు 10 వేల మంది వస్తారని అంచనా. అమ్మవారిని విశేషంగా అలంకరించనున్నారు. విజయ దుర్గా దేవి అవతారంలో అమ్మవారు దర్శనం ఇస్తారు. భక్తులకు ప్రసాద వితరణ చేయడంతో పాటు అన్నదానం చేయనున్నారు. భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం దసరా వేడుకలకు ప్రత్యేకంగా ముస్తాబైంది. ఎనిమిది రోజులుగా భద్రకాళీ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. విజయదశమి రోజున శనివారం అమ్మవారు రజిత చీరలో దర్శనం ఇవ్వనున్నారు. దసరా ఉత్సవాల చివరి రోజు కావడంతో భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగ్రరూపంలో ఉన్న వీరభద్ర స్వామివారిని శాంతింపజేసేందుకు భద్రకాళీ అమ్మవారు అవతరించారని భక్తుల నమ్మకం. ఇక్కడ కల్యాణం చేయించుకుంటే అతి శీఘ్రంగా వివాహం జరుగుతుందని భక్తుల విశ్వాసం. విజయ దశమి కావడంతో శమీ వృక్షం వద్ద పూజలను ఆలయ అర్చక, పురోహిత బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదే విధంగా అమ్మవారి ప్రసాద వితరణ, అన్నదానానికి సైతం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు.



అమలాపురం మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి



అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

అమలాపురంలో ప్రత్యేక ఏర్పాట్లు

అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద కూడా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వేప చెట్టు ఆలయం వద్ద అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. అంబాజీపేట మార్కెట్ వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, వెదురుపాక విజయదుర్గ పీఠం వద్ద అమ్మవార్లకు పూజలు చేస్తారు. వెదురుపాక పీఠానికి వేలాది మంది భక్తులు రానున్నారు. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల వద్ద వేసిన ఉత్సవ పందిళ్లు, సెట్టింగ్‌లు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలతోపాటు అన్నప్రసాద వితరణలు నిర్వహించనున్నారు. సాంస్కృతి కార్యక్రమాలతోపాటు అమ్మవారి ఊరేగింపులతో దసరా ఉత్సవాలు అంబరాన్నంటనున్నాయి.

మార్కెట్‌కు శోభ

దసరా పండగను పురస్కరించుకుని మార్కెట్‌కు కొత్త శోభ సంతరించుకుంది. ముఖ్యంగా వస్త్ర వ్యాపారంలో కొంత కదలిక వచ్చింది. చవితికి పెద్దగా అమ్మకాలు లేక ఢీలా పడిన వస్త్ర వ్యాపారులు దసరాలో అమ్మకాలు పెరగడంతో కొంత జోష్‌లో ఉన్నారు. అయితే బంగారు మార్కెట్‌లో మాత్రం కొనుగోలు పెద్దగా జరగడం లేదు. గ్రాము ధర రూ.7,740 వరకూ చేరడంతో కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేవని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలుదారులతో పూలు, పండ్ల మార్కెట్‌లు కళకళలాడుతున్నాయి.

బాలికలు ధైర్యంగా ముందడుగు వేయాలి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఝాన్సీరాణి తదితరులు

అమలాపురం రూరల్: బాలికలు ఏ విషయంలోనూ భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేయాలని ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి అన్నారు. అమలాపురం మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ బాలికలను బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. పలు అంశాలపై జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఎంఈవో ఎస్. దుర్గాదేవి మాట్లాడుతూ బాలికలు చక్కగా చదువుకోవాలని, భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ మేనేజర్ జి.శ్రీను మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. సీడీపీఓ వెంకటేశ్వరి మాట్లాడుతూ ఆడపిల్లలను వివక్షతో చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరింటెండెంట్ వెంకటరమణి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



కాతేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కాతేరు పంచాయతీ పరిధి శ్రీదేవి నగర్ బీసీ కాలనీలోని విజయ దుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇక్కడ శ్రీదేవి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మహిళలు మాట్లాడుతూ ప్రకృతిని పూజించే పండగ బతుకమ్మ సంబరం అన్నారు. కమిటీ సభ్యులు బలగం కిరణ్, ఉప్పాడి సూరిబాబు, పెండ్యాల నాగబాబు, మ ల్లు వలస రాంబాబు, యానాపు మధు, బందరు అప్పారావు పాల్గొన్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ఉపాధ్యాయుల రమేష్, కోట వంశీ, బాలు, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. సుమారు 60 మంది భక్తులు రూ.750తో టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి రూ.45 వేలు ఆదాయం సమకూరింది.

ఏవీ నగరంలో లక్షకుంకుమార్చన

తొండంగి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏవీ నగరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర శాసన మండలి సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబసభ్యులు కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లక్షకుంకుమార్చనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

ఎమ్మెల్సీ ఐవీ డిమాండ్



వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: రోజు రోజుకూ ఉపాధ్యాయులపై పెరుగుతున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండ్ చేశారు. స్థానిక ఎంప్లాయీస్ హోమ్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా విద్యాశాఖ పరంగా ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా రాష్ట్ర విద్యా పాఠశాల శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థను మరింత అయోమయానికి గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా మంత్రిగా లోకేష్ విద్యా వ్యవస్థలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటును పరిమితంగా, అవసరాన్ని బట్టి చేసుకుంటూ డీఎస్‌ఏ ద్వారా వచ్చే విద్యా సంవత్సరానికి ఖాళీలను భర్తీ చేయాలని ఎమ్మెల్సీగా తాను విద్యా శాఖ మంత్రిని అభ్యర్థిస్తే ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఉపాధ్యాయులకు దసరా సెలవులకు ముందు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారన్నారు. మళ్లీ దసరా సెలవులు అయిన వెంటనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. అసలు ఉపాధ్యాయులు బడి బయట ఉండాలా.. బడి లోపల ఉండాలా అనేది తెలియకుండా ఓ పక్క యాప్‌ల భారం, బోధనేతరంగా శిక్షణ తరగతులు ఇలా అనేక విషయాలతో విద్యార్థులకు అందించే విలువైన విద్యా విధానాన్ని చేతులారా హరిస్తున్నారని ఎమ్మెల్సీ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వ శిక్ష సిబ్బందికి జీతాలు లేవని, వారు చేసిన సమ్మె కాలానికి కూడా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. వీరితో పాటు అంగన్‌వాడీతో పాటు చిరు ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ ఆరోపించారు. చిరు ఉద్యోగుల జీతాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మందు షాపుల కోసం ముందుకు..

- మద్యం షాపులకు లక్ష్యానికి మించి దరఖాస్తులు
- జిల్లాలో 133 దుకాణాలకు ముగిసిన టెండర్లు
- ఇప్పటి వరకూ 3,894 దరఖాస్తులు

సాక్షి, అమలాపురం: టీడీపీ అనుకూల మద్యం మాఫియా ఆంక్షలను ధిక్కరించి నయా మద్యం వ్యాపారులు ముందుకొచ్చారు. మద్యం షాపులను దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. తొలి మూడు రోజులు దుకాణాలకు మందకొడిగా సాగిన దరఖాస్తులు.. చివరి మూడు రోజులు పెద్ద ఎత్తున రావడం విశేషం.

జిల్లాలో 133 మద్యం షాపులకు ప్రభుత్వం దరఖాస్తులు కోరింది. దీనికోసం ఈ నెల మూడవ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది. తొలుత ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తొలుత 3,500 వరకూ దరఖాస్తులు వస్తాయని అంచనా వేశారు. కానీ ఈ నెల 7వ తేదీ నాటికి కేవలం 310 మాత్రమే దరఖాస్తులు పడ్డాయి. దీంతో లక్ష్యం మేరకు టెండర్లు పడే అవకాశం లేదని అంచనా వేసిన ప్రభుత్వం గడువును 11వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. దీనితో పాటు దరఖాస్తుల లక్ష్యాన్ని సైతం 3,990కి పెంచింది.



చివరి నాలుగు రోజులూ..

చివరి నాలుగు రోజుల్లో టెండర్లు భారీగా పడ్డాయి. 9వ తేదీ నాటికి 2,738 వరకూ దరఖాస్తులు రాగా, 10వ తేదీకి 3,084 టెండర్లు పడ్డాయి. చివరి రోజు శుక్రవారం 810 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం మీద 3,894 దరఖాస్తులు పడ్డాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.77.88 కోట్ల వరకూ ఆదాయం వచ్చింది.

జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్ల వారీగా అందిన దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్	మద్యం దుకాణాలు	దరఖాస్తుల అంచనా	పడిన దరఖాస్తులు	నెరవేరిన లక్ష్యం (శాతంలో)
అమలాపురం	28	840	1017	121.07
ముమ్మిడివరం	13	390	438	112.31
కొత్తపేట	25	750	793	105.73
రాజోలు	29	870	813	93.45
ఆలమూరు	20	600	419	69.83
రామచంద్రపురం	18	540	414	76.67

జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట స్టేషన్ల పరిధిలో లక్ష్యానికి మించి టెండర్లు వచ్చాయి. రాజోలు, ఆలమూరు, రామచంద్రపురంలో లక్ష్యం కన్నా తక్కువగా దరఖాస్తులు అందజేశారు.

తమలో చేర్చుకుందామని..

తొలి రోజుల్లో టీడీపీ మద్యం మాఫియాకు భయపడి దరఖాస్తులు వేసేందుకు ఆశావహులు పెద్దగా ముందుకు రాలేదు. ప్రభుత్వం గడువు పెంచడంతోపాటు కొత్తగా ఎవరు వచ్చినా తమలో చేర్చుకుందామనే ఆలోచనతో మద్యం సిండికేటుదారులు కొంత ఉదారంగా వ్యవహరించడంతో అంచనాల మేరకు దరఖాస్తులు వేశారు. మద్యం సిండికేట్‌దారుల ఒత్తిడి లేకుంటే మరిన్ని దరఖాస్తులు పడేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తంభించింది. ఇసుక లేక నిర్మాణ రంగం కూడా దాదాపు ఆగిపోయింది. ఈ సమయంలో మద్యం వ్యాపారం లాభదాయకంగా కనిపిస్తోంది. పైగా రోజువారీ అమ్మకాల కారణంగా సొమ్ము పెద్ద ఎత్తున చేతులు మారుతుంటుంది. ఇలా ఏ విధంగా చూసినా వ్యాపారం బాగుంటుందనే ఉద్దేశంతో పలువురు మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయాలని ఉవ్విళ్లూరారు. మొదట్లో సిండికేట్‌ల ఒత్తిడికి దూరమయ్యారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మికతకు సాధనే ప్రధానం

- శ్రీపీఠం స్వామీజీ పరిపూర్ణానంద
- మహాలక్ష్మిగా ఐశ్వర్యాంబిక దర్శనం
- నేటితో ముగియనున్న మహాశక్తి యాగం


పరిపూర్ణానంద స్వామీజీ

కాకినాడ రూరల్: ఆధ్యాత్మిక ప్రపంచంలో సాధనే ప్రధానమని, అమ్మను ఆరాధిస్తే ధనం కంటే గొప్ప దైవబలం దక్కుతుందని శ్రీపీఠం స్వామీజీ పరిపూర్ణానంద పేర్కొన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేటలో మహాశక్తి యాగం శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. విజయ దశమి సందర్భంగా శనివారం ఉదయం కుంకుమార్చనలు అనంతరం మహాపూర్ణాహుతితో వేడుకలు ముగియనున్నాయి. లలితా సహస్ర నామార్చనలతో వేలాది మంది మహిళలు దీక్షా వస్త్రాలతో కుంకుమపూజ చేశారు. కుంకుమార్చనలు వంద కోట్లకు చేరువయ్యాయి. తొమ్మిదో రోజు ఐశ్వర్యాంబిక మహాలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. విశేష హోమంగా శ్రీసూక్త, మహాలక్ష్మి హోమం, ఐశ్వర్య ప్రాప్తి కోరుతూ తులసీ సరస్వతీ పూజ నిర్వహించారు. శనివారంతో వంద కోట్ల లలితా కుంకుమార్చనలు పూర్తికానున్నాయి. ప్రకృతిని మనకు అనుకూలంగా మా ర్చుకోగలిగితే అదే ఆధ్యాత్మిక సాధన అవుతుందన్నా రు. శనివారం ఉదయం 9 గంటలకే కుంకుమార్చనలు ప్రారంభించి 10.30 ముగిస్తామన్నారు. దీక్షను సాయంత్రం పూర్తి చేస్తూ అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. 64 వేల కోట్ల మంత్ర సారం లలితా సహస్రనామమని ఆయన పేర్కొన్నారు.

సముద్రంలో వ్యక్తి గల్లంతు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో సముద్ర స్నానానికి దిగిన వ్యక్తి గల్లంతైన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జగన్మోహన్‌రావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెరుమాళ్లపురం సమీపంలోని లైఫస్ కంపెనీలో బిహార్‌కు చెందిన వినయ్‌కుమార్ గుప్తా సహోద్యోగులతో కలసి శుక్రవారం దగ్గరలోని పెరుమాళ్లపురం తీరంలోని సముద్ర స్నానానికి వెళ్లారు. సముద్రంలో గుప్తా గల్లంతవ్వడంతో అక్కడి వారంతా మత్స్యకారులకు సమాచారం అందించారు. వారు వెతికేందుకు ప్రయత్నించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తరతరాల చరిత.. చెడీ తాలింఖానా ఘనత

- ఏడు వీధుల ఊరేగింపులతో సంబరం
- రణ రంగాన్ని తలపించే ఆయుధాల ప్రదర్శన
- అమలాపురంలో నేడు దసరా ఉత్సవాలు

అమలాపురం టౌన్: తరతరాల చరితకు అది ఆనవాలు.. రణ రంగాన్ని, వీరత్వాన్ని ప్రదర్శించే వీర విద్యకు చెడీ తాలింఖానా తార్కాణం.. అమలాపురంలో దసరా ఉత్సవాల్లో చెడీ తాలింఖానాకు ఎంతో ఆదరణ ఉంది. ఇక్కడి ఏడు వీధులకు చెందిన దేవతామూర్తుల వాహనాలు, ఊరేగింపుల సమ్మేళనంతోనే దసరా ఉత్సవాలు సాగడం అనాదిగా వస్తున్న ఆచారం. కొంకాపల్లి, మహిపాల వీధి, గండు వీధి, రవణంమల్లయ్య వీధి, నల్లా వీధి, రవణం వీధి, శ్రీరామపురం వీధి వాహనాలు ఈ దసరా ఊరేగింపుల్లో పాల్గొంటాయి. తొలుత కొంకాపల్లి చెడీ తాలింఖానా 1835లో బ్రిటీష్ పాలనలో అంకుర్పారణ జరిగింది. నాటి నుంటి నేటి వరకూ కొంకాపల్లి వీధి 189 ఏళ్ల చరిత్రను సొంతం చేసుకుంది. తర్వాత అమలాపురం మహిపాల వీధిలో చెడీ తాలింఖానా 1856లో ప్రారంభమైంది. ఇక్కడ నాలుగు తరాలుగా వీరవిద్యను పోషిస్తున్నారు. గండు వీధికి 114 ఏళ్లు, రవణం మల్లయ్య వీధికి 109 ఏళ్ల చరిత్ర ఉంది. రవణం వీధి, నల్లా వీధి, శ్రీరామపురం వీధుల ఉత్సవాలకు వందేళ్లలోపు చరిత్ర ఉంది. అమలాపురం దసరా ఉత్సవాలు, చెడీ తాలింఖానా ప్రదర్శనలకు మెచ్చి మహిపాలవీధి, కొంకాపల్లి వీధుల నిర్వాహకులకు అలనాడు బ్రిటీష్ పాలకులు తామ్ర పత్రాలు కూడా అందించారు. ఒక్కో వీధి ఒక్కో దేవతామూర్తి వాహనంతో తమ వీధుల్లోంచి దసరా ఊరేగింపులకు శ్రీకారం చుడతాయి. శనివారం సాయంత్రం నుంచి ఈ ఊరేగింపు మొదలై ఆదివారం ఉదయం తెల్లవారే వరకూ నిర్విరామంగా సాగుతుంది. అర్ధ రాత్రి దాటిన తర్వాత ఈ ఏడు వీధుల ఊరేగింపులు సమ్మేళనం ఉంటోంది. చెడీ తాలింఖానాకు ఆరాధ్య దైవం భేతాళస్వామి. ఏటా దసరాకు కొన్ని రోజుల ముందు ఈ వీధుల చెడీ తాలింఖానా నిర్వాహకులు తమ ఆయుధాలను జమ్మి చెట్టు వద్దకు తీసుకువెళ్లి జమ్మి కొట్టిన తర్వాతే ప్రదర్శనలకు శ్రీకారం చుట్టతారు. తొలుత భేతాళస్వామి ఆలయం వద్ద ఆయుధ పూజలు చేస్తారు. తర్వాత దసరా ఉత్సవాల కోసం చెడీ తాలింఖానా ఆయుధాల విన్యాసాలతో యువకులు ముందస్తు కసరత్తు, శిక్షణ పొందుతారు.


నేలపై పడుకున్న వ్యక్తిపై ఉంచిన కొబ్బరి కాయలను కత్తితో పగులగొడుతూ..


చెడీ తాలింఖానాలో అగ్గి బరాటాల విన్యాసాలు


కర్రలతో తలపడుతున్న నల్లా వీధి యువకులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

అమలాపురంలో శనివారం ఏడు వీధుల దసరా ఉత్సవాలు, ఊరేగింపుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు తప్ప మిగిలిన ఏ ఇతర వాహనాలకు పట్టణంలోకి ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అంబాజీపేట, ముక్కామల వైపు నుంచి వచ్చే వాహనాలు ఈదరపల్లి వంతెన కుడి వైపు నుంచి భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా పేరూరు వై.జంక్షన్, అల్లవరం మండలం, రాజోలు వైపు వెళ్లాలి. కాకినాడ వైపు వెళ్లే వాహనాలు వంతెన ఎడమ వైపు నుంచి సావరం బైపాస్ రోడ్డు మీదుగా నల్ల వంతెన, ఎర్ర వంతెన మీదుగా వెళ్లాలి.

- కాకినాడ నుంచి వచ్చే వాహనాలు భట్నవిల్లి 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు సెంటర్ మీదుగా తాటిపాక, రాజోలు, అల్లవరం వైపు వెళ్లాలి. అంబాజీపేట, ముక్కామల వెళ్లేందుకు ఎర్ర వంతెన, నల్ల వంతెన, సావరం బైపాస్ రోడ్డు మీదుగా ఈదరపల్లి వంతెన నుంచి వెళ్లాలి.
- బోడసకుర్రు వంతెన నుంచి వచ్చే వాహనాలు అంబాజీపేట, కొత్తపేట వెళ్లేందుకు బోడసకుర్రు వంతెన దిగిన వెంటనే ఎడమ వైపుగా తోట్లపాలెం మీదుగా వెళ్లాలి.
- ఎర్ర వంతెన వైపు వచ్చే వాహనాలు వంతెనకు ఎడమవైపు నుంచి విత్తనాల కాల్వగట్టు మీదుగా వడ్డిగూడెం నుంచి బైపాస్ రోడ్డుకు గాని బుచ్చెమ్మ అగ్రహారం మీదుగా ఎత్తు రోడ్డుకు గానీ వెళ్లాలి. ఎర్ర వంతెన వైపు నుంచి వంతెన కుడి వైపునకు నల్ల వంతెన, సావరం బైపాస్ రోడ్డు మీదుగా ఈదరపల్లి వంతెన నుంచి వెళ్లాలి.
- నల్లవంతెన వైపునకు వచ్చే వాహనాలు వంతెనకు ఎడమవైపు నుంచి ఎర్ర వంతెన మీదుగా విత్తనాల వారి కాల్వగట్టు, వడ్డిగూడెం నుంచి బైపాస్ రోడ్డుకు లేదా బుచ్చెమ్మ అగ్రహారం మీదుగా ఎత్తు రోడ్డుకు వెళ్లాలి.

గగుర్పాటు కలిగించేలా ప్రదర్శనలు

చెడీ తాలింఖానా వీర విద్యను పలు ఆయుధాలతో ప్ర దర్శిస్తున్నప్పుడు చూపరులకు గగుర్పాటు కలిగిస్తా యి. పట్టా కత్తులు, డాళ్లు, లేడి కొమ్ములు, అగ్గి బరా టాలు, కర్రలు ఇలా అనేక ఆయుధాలతో తలపడి ఓ రణ రంగాన్ని తలపిస్తారు. వీర విద్యను ప్రదర్శించే వ్యక్తి కళ్లకు గంతలు కట్టుకుని నేలపై పడుకున్న వ్యక్తి ఉదరంపై కొబ్బరి కాయలు, పలు రకాల కూరగాయ లను పట్టా కత్తులతో ఒకే వేటుతో రెండు చెక్కలు చేస్తా రు. తాళ్లు, కర్రలకు అటు ఇటు నూనెలో నానిన వస్త్రాల బంతులు కట్టిన అగ్గి బరాటాలను వెలిగిస్తారు. ఆ అగ్గి బరాటాల విన్యాసాలు ఆసక్తి కలిగిస్తాయి.

పోలీసు బందోబస్తు కత్తిమీద సామే

అమలాపురంలో చెడీ తాలింఖానా ప్రదర్శనల సందర్భంగా నిర్వహించే ఏడు వీధుల ఊరేగింపులు ప్రశాంతంగా ముగిసే వరకూ పోలీసు శాఖ టెన్షన్‌గానే ఉంటోంది.

జిల్లా పోలీసు శాఖ కూడా అమలాపురం దసరా ఊరేగింపులకు అత్యంత పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేస్తుంది. జిల్లా ఎస్పీ, ఏఎస్పీ పర్యవేక్షణలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బంది, అదనపు పోలీసు బలగాలు ఇలా మొత్తం 600 మంది పోలీసు యంత్రాంగం బందోబస్తులో నిమగ్నమవుతోంది.

ఆర్టీసీ రమణ ఆకస్మిక మృతి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్ టేకుమూడి వెంకటరమణ(ఆర్టీసీ రమణ) (57) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. నాలుగు రోజులుగా అరుణాచలం గిరి ప్రదక్షిణ బస్సు యాత్రకు సంబంధించి వ్యవహారాలు చక్కబెడుతున్న రమణ ఒంట్లో నలతగా ఉండటంతో శుక్రవారం డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో వెంకటరమణ ఇంటికి వెళ్లారు. ఆయనకు వాంతులు కావడంతో పాటు ఒళ్లు చల్లబడడంతో కుమారుడు ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. షుగరు, బీపీల స్థాయి తగ్గిపోయి ఆయన మృత్యువాత పడ్డారని బంధువులు తెలిపారు.

మోసగించిన యువకుడిపై కేసు

నల్లజర్ల: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఓ యువతిని మోసగించిన ఘటనలో ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. అనంతపల్లి శ్రీనివాస కాలనీలో పెనుమాక సురేష్ ఉంటుండగా, అదే ప్రాంతానికి చెందిన యువతితో పరిచయం పెంచుకున్నాడు. ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేశాడు. కుల పెద్దల సమక్షంలో ఆ యువకుడిని నిలదీయడంతో తనకు సంబంధం లేదని ముఖం చాటేశాడు. దీంతో ఆ యువతి తల్లిదండ్రులు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు నిందితుడు పెనుమాక సురేష్‌పై కేసు నమోదు చేశారు.

ఫైనాన్స్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

కాకినాడ క్రైం: కాకినాడలోని సంతచెరువు జంక్షన్‌లో ఉన్న ఎస్ఆర్‌కే బిల్డింగ్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న మధుసూదన్ ఆటో ఫైనాన్స్ కార్యాలయంలో ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.25 వేల విలువైన ఫర్నిచర్ దగ్ధమైంది. పత్రాలన్నీ భద్రంగా ఉన్నాయని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని అధికారులు వెల్లడించారు. సాలిపేట ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

పీతల సాగు.. ప్రోత్సహిస్తే బాగు

- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- రైతులకు సిరుల పంట


నీళ్లరేవులో పీత సాగు చేస్తున్న రైతులతో మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ (ఫైల్)

కాట్రేనికోన: పీతల సాగును ప్రోత్సహిస్తే లాభాల పంటే.. ఈ పెంపకంలో రైతులు మేలైన యాజమాన్య, సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులే.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 971 కిలోమీటర్ల మేర కోస్తా తీరం ఉంది. ఈ తీరం వెంబడి వేలాది ఎకరాల ఉప్పు నీటి కయ్యలు, పర్రభూములు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో టైగర్ రొయ్యల సాగులో వైరస్‌లు విజృంభించడంతో సముద్ర తీరం వెంబడి పర్ర భూముల్లో చెరువులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఉప్పు నీటి పర్ర భూముల్లో పచ్చ, మండ పీతలు పెంపకానికి అనుకూలంగా ఉంటాయని కాకినాడ మత్స్యశాఖ విశ్రాంత డీడీ రామ్మోహనరావు అన్నారు. ఈ ప్రాంతంలో పచ్చ పీతలు పెరుగుదల అధికంగా ఉంటుంది. వీటికి విదేశీ మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉంది. ఉప్పు నీటి పర్ర భూముల్లో పీతల సాగును ప్రోత్సహించేందుకు గతంలో మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ నీళ్లరేవు, చిర్రయానం గ్రామాల్లో పర్యటించారు. పీతల సాగు చేస్తున్న రైతులతో సమావేశం అయ్యారు.

మట్టి పరీక్షల ఆధారంగా..

రైతులు పీతల చెరువు మట్టి పరీక్షల ఆధారంగా టెక్నికల్ సిబ్బంది సలహా మేరకు సున్నం, జిప్సం, బ్లీచింగ్ పౌడర్‌లను చల్లించాలి. చెరువు లోతు కనీసం మూడు అడుగులు తగ్గకుండా ఉండాలి. చెరువులోకి ఇతర చేపలు, రొయ్యల పిల్లలు రాకుండా నీటిని పెట్టేటప్పుడు మెస్ కట్టి వడగట్టిన నీటిని మాత్రమే తోడాలి. చెరువులోకి వ్యాధికారక జీవులు ప్రవేశించకుండా చిక్కని మెస్‌తో దశల వారీ ఫిల్టర్ చేసిన నీటిని మాత్రమే తోడాలి. నీటి నాణ్యత పద్ధతులను పాటించి, సేంద్రియ పదార్థాలు పేరుకుపోకుండా చూసుకోవాలన్నారు.

బయో సెక్యూరిటీ తప్పనిసరి

చెరువులోని పీతలు బయటకు పోకుండా, చెరువు బయట ఇతర జీవులు లోపలకు రాకుండా చెరువు చుట్టూ గట్టుపై మెస్‌ను బయో సెక్యూరిటీగా ఏర్పాటు చేయాలి. చెరువు చుట్టూ బయో సెక్యూరిటీగా కట్టిన మెస్‌లతో ఇతర చెరువుల నుంచి వ్యాధికారక పీతలు, తాబేళ్ల వంటి జీవులతో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటుంది. బయో సెక్యూరిటీతో వ్యాధుల నుంచి రక్షణతో పాటు చెరువులోని పీతలు బయటకు వెళ్లిపోకుండా ఉంటుంది.

సాగుకు పచ్చ పీతల సీడ్

పచ్చ పీతల సాగు కోసం హేచరీల నుంచి, సంప్రదాయ పద్ధతిలో సీడ్‌ను సేకరిస్తున్నారు. పచ్చ పీతలు సాగు చేసేందుకు అవసరమైన సీడ్‌ను మద్రాసు హేచరీల నుంచి తీసుకు వస్తున్నారు. స్థానికంగా గోదావరి పాయలు, పర్రభూముల నుంచి కూడా పీత సీడును సేకరిస్తున్నారు.

- పీతల పెంపకంలో గుల్ల గట్టిగా లేని పీతలను నీటి పీతలు అంటారు. వీటిని గుల్ల గట్టిబడే వరకూ పెంచడాన్ని క్రాబ్ ఫాటనింగ్ అంటారు. దీనిని సంప్రదాయ పద్ధతి, బాక్స్ పద్ధతిలో చేపట్టవచ్చు. ఈ పీతలను నెల రోజుల్లోపు పట్టుబడి చేయవచ్చు. పీతలకు కృత్రిమ మేతలు మార్కెట్‌లో అందుబాటులో లేవు. పీతలు మాంసాహారి కావడంతో స్థానికంగా దొరికే చిన్న చేపలు, నత్త గుల్లలను ఆహారంగా అందిస్తున్నారు. మేతను రోజుకు మూడు సార్లు అందిస్తూ అధిక శాతం సాయంత్రం వేళ వేయాలి. చెరువులోని పీతల సరాసరి బరువులో 6 శాతం తాజా మేత అందించాలి. మేతను అవసరమైనంత మాత్రమే ఇవ్వాలి. అధికంగా మేతను చెరువులో వేయడంతో నీటిలో కుళ్లిపోయి నీరు కలుషితం అవుతుంది. తద్వారా వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటుంది. పీతల సాగు చేస్తున్న రైతులకు అవసరమైన సీడు, సాగుపై సాంకేతిక సలహాలు మత్స్య శాఖ అందిస్తే సిరులు కురిపించినట్లు అవుతోంది.

షెల్టర్లు ఏర్పాటు చేయాలి



పీతలు స్వజాతి భక్షణ (కెనబాలిజం) కలిగి ఉండటంతో గుల్ల విడిచే సమయంలో మెత్తని పీతలను గట్టివి తినేయడంతో ఇబ్బంది వస్తుంది. పీతలు గుల్ల కొట్టే సమయంలో రక్షణ కోసం పైపు ముక్కలు, పాడైన మట్టి కుండలు, చెట్టు కొమ్మలను షెల్టర్లుగా ఏర్పాటు చేయాలి. ఈ ప్రదేశాలు వాటికి రక్షణ ఉంటాయి.

–టి.విజయ భారతి, మత్స్యశాఖ, డీడీ (తెలంగాణ)

మేత వృథాతో వ్యాధులు



పీతలకు ప్రస్తుతం పాకుడు వ్యాధి, గుల్ల రంగు మారిపోవడం, మొప్పలు కుళ్లిపోవడం, పరాన్న జీవులు పేరుకుపోవడం, మొప్పల రంగు, గుల్లరంగు మారిపోవడం, పీతల శరీరంలో మాంసం లేకుండా నీరు మాత్రమే ఉండటం (కండర క్షీణత) వంటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. మేత వృథా కావడంతో చెరువు నీరు చిక్కబడి నాణ్యత లోపించడం, విషవాయువులు ఉత్పత్తి కావడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి. రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు పాటించాలి.

–రామ్మోహనరావు, (విశ్రాంత) మత్స్యశాఖ డీడీ, కాకినాడ

ఆటోను ఢీకొన్న కారు


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది


రోడ్డుపై బోల్తాపడిన ఆటో

ఐదుగురికి గాయాలు

గండేపల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి ఆటోలో అన్నవరం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మండలంలోని మురారి శివారుకు వచ్చే సరికి ముందు వెళుతున్న లారీని ఆటో తప్పించే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో మండపేట నుంచి అన్నవరం దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఆటో రోడ్డుపై బోల్తా పడగా, దాని కింద డ్రైవర్ చిక్కుకున్నాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎం.వీరబాబు, డి.సత్యవతికి తీవ్ర గాయాలు కాగా, డి.నిహారిక, ఎం.మావుళ్లమ్మ, కె.జయలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరంతా సమీప బంధువులని తెలిసింది. ప్రమాద స్థలానికి పోలీసులు చేరుకుని ఐదు క్షతగాత్రులను రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కారులో ఉన్న నలుగురు ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. పెట్రోలింగ్ సిబ్బంది ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆటో పూర్తిగా నుజ్జవగా, కారుకు ముందు భాగం దెబ్బతింది.

బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

కొవ్వూరు: స్థానిక రోడ్డు కం రైలు వంతెన టోల్‌గేట్ జంక్షన్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పులి అనంతమ్మ (73) దుర్మరణం పాలైంది. ఇక్కడి వాంబే కాలనీకి చెందిన అనంతమ్మ రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి వెళ్లేందుకు టోల్‌గేట్ జంక్షన్‌కు వచ్చింది. రోడ్డు మార్జిన్‌లో నిలబడిన ఆమెను బస్సు ఢీకొనడంతో వెనుక చక్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పులి సుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. అనంతమ్మ భర్త కాటయ్య కొంతకాలం క్రితమే మృతి చెందారు. నెల్లూరు జిల్లా ఇందుకూరి పేట వీరి స్వగ్రామం. ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా అనంతమ్మ కొవ్వూరులోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రమాదం జరిగి మృతి చెందింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పెరవలి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పెరవలి ఎస్సై పి.అప్పారావు కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై పిట్టల వేమవరం వద్ద తెల్లవారుజాము 1.15 గంటలకు 60 ఏళ్ల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నీలం రంగు చొక్కా, సిమెంట్ రంగు నిక్కరు వేసుకుని ఉన్నాడు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు పెరవలి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

దేవరపల్లి: రోడ్డుపై డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని చినకరనగర్ కాలనీకి చెందిన డి.యశ్వంత్ నాగప్రశాంత్(25) రాజమహేంద్రవరంలో ఉంటున్నాడు. యశ్వంత్ నాగప్రశాంత్, అతని స్నేహితుడు ఆకుల అఖిలేష్ తొమ్మిది రోజుల భవానీ మాల వేసుకున్నారు. గురువారం ఇద్దరూ కలసి బైక్‌పై విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా దేవరపల్లి మండలం య ర్నగూడెం గండి చెరువు వద్దకు వచ్చేసరికి వర్షం కురిసింది. దీంతో వర్షపునీటి కారణంగా బైక్ అదుపుతప్పి డి వైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో యశ్వంత్ నాగప్రశాంత్ అక్కడకక్కడే మృతి చెందగా, అఖిలేష్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో అత న్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


అవలరెడ్డి మనోహర్ (ఫైల్)

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామానికి చెందిన అవలరెడ్డి మనోహర్ (27) అతని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. మనోహర్ తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి దుర్గతో పందలపాక పెద్దవీధి శివారులో నివాసం ఉంటున్నాడు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా మనోహర్ పనిచేస్తున్నాడు. అయితే ఉదయం అతని తల్లి ఇంటికి తాళం వేసి పక్క వీధిలోని తన వదిన ఇంటికి వెళ్లింది. 11 గంటల సమయంలో ఇంటి వచ్చి చూసేసరికి తాళం పగల కొట్టి ఉందని, వెంటనే ఇంటి లోపలకు వెళ్లి చూసేసరికి తన కుమారుడు మనోహర్ ఉరివేసుకుని మరణించినట్లు ఉందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూల్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి చెస్ పోటీలు ఉత్కంఠగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో నలుగురు బాలురు, నలుగురు బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ తెలిపారు. బాలుర విభాగం నుంచి బందారు నానిబాబు (ప్రథమ), కేశనకుర్తి రాజేష్ (ద్వితీయ), పితాని ధాన్య సత్యకార్తీక్ (తృతీయ), అరిగెల జయప్రకాష్ (నాలుగో) స్థానాలను గెలుచుకున్నారు. అలాగే బాలికల విభాగంలో గెద్దాడ దేవి అక్షయ (ప్రథమ), పినిశెట్టి ధరణి (ద్వితీయ), గెద్దాడ అశ్రయ (తృతీయ), పితాని సాయిలిఖిత (నాలుగో) స్థానాలను కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన ఈ ఎనిమిది మంది విజేతలు ఈ నెల 15వ తేదీ నుంచి గుంటూరులో జరగనున్న రాష్ట్ర చెస్ సబ్ జూనియర్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడనున్నారని జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ తెలిపారు. విజేతలకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.జగదీష్, విద్యా నిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడులు బహుమతులు అందజేశారు.